ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల జిల్లా వార్తలు
5
గురువారం 6 జూన్ 2024





ఎన్నికల ఫలితాలపై
పోస్టుమార్టం

- ప్రణాళికలు బెడిసికొట్టడమే కారణం
- మూడో స్థానంలో నిలువడంపై బీఆర్‌ఎస్ అంతర్మథనం
- మంచిర్యాలలో అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ
- ఓటమిపై ముఖ్య నాయకులతో ఆరా

మంచిర్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ పెద్దపల్లి సెగ్మెంట్ ఎన్నికల ఫలితాలపై ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పోస్టుమార్టం ప్రారంభించాయి. ఓటింగ్‌కు ముందు రోజు వరకు తమకు అనుకూల ఫలితాలు వస్తాయని అంచనా వేసిన ఆయా పార్టీల అభ్యర్థులకు ఊహించని రీతిలో షాక్ తగిలింది. ముఖ్యంగా బీజేపీలో ఈ పరిస్థితి మరింత అధికంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే మొన్నటి పార్లమెంట్ ఎలక్షన్లలోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటమి పాలు కావడం జిల్లాలో చర్చనీయాంశం అయింది. అసలు లోపం ఎక్కడుందో అన్వేషించే పనిలో పడ్డారు.

ప్రత్యేక ప్రణాళికతో వెళ్లినా..

ఎన్నికల సమయంలో అన్ని పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం ఎవరికి వారే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకున్నారు. సీనియర్ల సలహాలు, సూచనలతో వ్యూహరచన గావించారు. తీరా ఫలితాలు వారి అంచనాలకు విరుద్ధంగా రావడంతో పునరాలోచనలో పడ్డారు. బీఆర్‌ఎస్, బీజేపీలు నేరుగా ఓటర్లను కాకుండా ఆయా ప్రాంతాల్లోని వివిధ కమిటీలను నమ్ముకోవడంతో మొదటికే మోసం వచ్చినట్లయింది. పట్టణాలు, గ్రామాలు తేడా లేకుండా వివిధ సంఘాలపైనే అభ్యర్థులు పూర్తిగా ఆధారపడ్డారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం ఇతర పార్టీల అభ్యర్థుల అంచనాలను తారుమారు చేసింది.

బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే టికెట్ పొందడంపై చూపిన శ్రద్ధ ప్రచారంలో చూపకపోవడం వల్లే ఆయన ఓటమి పాలయ్యారని చెబుతున్నారు. పార్ల మెంట్ ఎన్నికల్లో బీజేపీ టికెట్ కోసం చాలా మంది ప్రయత్నించారు. కాగా అధిష్టానం గొమాసేకు టికెట్ కేటాయించింది. ఆయన నేతకాని సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆ సామాజిక వర్గానికి చెందిన ఓట్లన్నీ పడతాయని పార్టీ అంచనా వేసింది. పార్టీ అంచనాలకు అనుగుణంగా గొమాసే ప్రచారంలో పాల్గొనకపోవడం నష్టాన్ని మిగిల్చింది.

బీజేపీకి అనుకూల పరిస్థితులు ఉన్నా...ఓటమి చెందడంపై ఆ పార్టీ నాయకులు విశ్లేషణ చేస్తున్నారు. కేవలం ప్రచారంలో వెనుకబడటమే బీజేపీ అభ్యర్థి ఓటమిపాలు కావడానికి కారణంగా భావిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నా ప్రచారంలో స్పీడు పెంచక పోవడంతో శ్రీనివాస్ గొమాసేపై పార్టీ ముఖ్యులు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. అయినా తన పద్ధతి మార్చుకోకపోవడంతో ఓటమి పాలయ్యారని చెబుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే..

అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎలక్షన్‌లో కూడా బీఆర్‌ఎస్ మూడో స్థానానికి పరిమితం కావడం గమనార్హం. బీఆర్‌ఎస్ తరుపున మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బరిలో దిగినప్పటికీ ప్రజలు తమ నిర్ణయాన్ని మార్చుకోలేదు. కొప్పుల ఈశ్వర్ తరుపున స్వయంగా మాజీ సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా ఓటర్లు పెద్దగా స్పందించలేదు.

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యలు కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా చెన్నూరులో బహిరంగ సభ నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. జిల్లాలోని మూడు నియోజక వర్గాల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి మూడో స్థానానికి పడిపోవడంతో కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

నకిలీ పత్తి పత్తినాలు పట్టివేత

- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

వేమనపల్లి, జూన్ 5: వేమనపల్లి సమీపంలో ప్రాణహిత నది ఫెర్రీ పాయింట్ వద్ద బుధవారం ఉదయం మహారాష్ట్ర నుంచి వేమనపల్లికి ఎడ్లబండిలో తరలిస్తున్న 2.05 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీని వాస్ తెలిపారు. బుధవారం సీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నుంచి వేమనపల్లికి నకిలీ పత్తివిత్తనాలు సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు నీల్వాయి పోలీసులు , వ్యవసాయాధికారులు మాటు వేసి పట్టుకున్నామన్నారు. మహారా ష్ట్రలోని సిరొంచ తాలూకా కోటపల్లికి చెందిన కోలా సాయికిరణ్‌ను పట్టుకున్నారని తెలిపారు. దీంతో పోలీసులను చూసి కోలా రమేష్, సుమిత్, జంగ సంపత్ అనే నిందితులు పరారయ్యారని తెలిపారు. పట్టుకున్న నకిలీపత్తి విత్తనాల విలువ రూ. 6.75 లక్షలు ఉంటుందని తెలిపారు. నకిలీ విత్తనాలతో పాటు ఎడ్లబండి, ఎద్దులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కాగా నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ శ్యామ్‌పటేల్, కానిస్టేబుల్ రాజేందర్, రాజశేఖర్‌లకు సీపీ ప్రత్యేకంగా అభినందించి రివార్డు అంద జేశారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్‌ఐ శ్యాంపటేల్ పాల్గొన్నారు.

పనులు సత్వరం పూర్తి చేయాలి


జోగాపూర్‌లో పనులు పరిశీలిస్తున్న డీఈఓ యాదయ్య

నెన్నెల, జూన్ 5 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అధికారులకు సూచించారు. మండలంలోని నందులపల్లి, ఘన్‌పూర్, జోగాపూర్, నెన్నెల పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పథకం కింద చేపడుతున్న పనులను బుధవారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. పనుల నిర్వహణలో ఎక్కడా అలసత్వానికి తావు ఇవ్వకూడదన్నారు. పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఈ పాటికే నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్నామన్నారు. నిర్మాణం పనులపై హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈఈ కామేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎంలు ప్రకాష్‌రావు, చక్రపాణి ఉన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి


నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు

జైపూర్, జూన్ 5: పారిశుధ్య సిబ్బంది ప్రతీ రోజు చెత్తాచెదారం తొలగిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని టేకుమట్ల గ్రామంలో పారిశుధ్య పనులు, నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్తా చెదారం, ప్లాస్టిక్ లేకుండా చూడాలని చెప్పారు. ఇంటింటికి చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. డ్రైవేస్ట్‌ను, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్‌లో కంపోస్టు ఎరువు తయారీని నిరంతరం కొన సాగించాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, హరితహారానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఖాళీ బ్యాగులు కనబడ కుండా ప్రతి బ్యాగులో స్టంప్స్ నాటుకోవాలని సూచించారు. పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు నీరు పోసి కాపాడాలన్నారు. శ్మశాన వాటిక పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ ఉన్నారు.

సీహెచ్‌పీలో విధుల బహిష్కరణ

శ్రీరాంపూర్, జూన్ 5 : శ్రీరాంపూర్ సీహెచ్‌పీ డీజీఎం డీవీ. రావు వైఖరిని నిరసిస్తూ ఉద్యోగులు బుధవారం విధులు బహిష్కరించారు. పర్యావరణాన్ని నిర్వహించేందుకు సిద్ధమవగా, ఆయన వివక్షను వ్యతిరేకిస్తూ విధుల్లోకి వెళ్లకుండా నిరసన తెలిపారు. ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి జె శంకర్‌రావు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సంబరాలు

శ్రీరాంపూర్, జూన్ 5: ఎంపిగా గడ్డం వంశీకృష్ణ గెలువడంతో ఆర్‌కె 6 గనిపై ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యకర్తలకు, కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీగా గడ్డం వంశీకృష్ణ గెలవడంతో బుధవారం ఐఎన్‌టీయూసీ నాయకులు కేకే 5 గనిపై సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్, నాయకులు రాజేంద్ర ప్రసాద్, రవి, స్వామి, కృష్ణమోహన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు..

చెన్నూరు, జూన్ 5: పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపొందడంతో మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హాజీపూర్, జూన్ 5: మండలంలోని నంనూర్ గ్రామానికి చెందిన కారుకూరి రాజమణి (58) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. రాజమణి కొన్ని రోజులుగా తీవ్ర తలనొప్పి తో బాధపడుతోంది.. అలాగే భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గత నెల 24న పురుగుల మందు తాగింది. కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య

హాజీపూర్, జూన్ 5: అనారోగ్యంతో బాధపడుతూ మండలంలోని పెద్దంపేట గ్రామానికి చెందిన బెంబడి బక్కయ్య(70) అనే వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. బక్కయ్య బుధవారం గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించేలోపు బక్కయ్య అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 5: జిల్లాలో ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న శారీరక వికలాంగులు, 19న మానసిక వికలాంగులు, 21న కంటి చూపు, 25న మూగ చెవుడు అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించనున్నామని, ఈ నెల 7న స్లాట్ ఓపెన్ చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చెన్నూరు, జూన్ 5: మండలంలోని కొమ్మెర గ్రామంలో బుధవారం విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందింది. గ్రామంలోని కమ్మగోని విజయలక్ష్మికి చెందిన గేదె ఉదయం మేతకు వెళ్లే సమయంలో గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 5: జీవరాశి మనుగడకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, జిల్లా స్త్రీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి చిన్నయ్యతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి పట్ల ప్రతి ఒక్కరు కర్తవ్యాన్ని నిర్వహించాలని, మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. ప్రతి ఇంట్లో, కార్యాలయంలో ఇంకుడుగుంతలను పునరుద్ధరించాలని సూచించారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం అందరితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

జన్నారం: పర్యావరణాన్ని కాపాడడం అందరి బాధ్యత అని ఇందన్‌పల్లి ఎఫ్‌ఆర్వో హఫీజుద్దీన్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని కవ్వాల టైగర్ జోన్‌లో ఘనంగా నిర్వహించారు. ఇందన్‌పల్లి అటవీ ప్రాంతంలోని పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ , చెత్తా, చెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ జన్నారం డివిజన్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరు సహకరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అన్నారు. అంతకుముందు జన్నారం, తాళ్లపేట రేంజ్‌లో అటవీ శాఖ అధికారులు చెత్తను తొలగించడంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వోలు గోపికృష్ణ, బీట్ అధికారులు పాల్గొన్నారు.

ఏసీసీ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని హాజీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరు చెట్లు నాటాలని పర్యావరణాన్ని కాపాడా లనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గోనె శ్యాంసుందర్‌రావు, పున్నూరి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, సుధాకర్, జితేందర్‌రావు, సిరిపురం రాజేశం, సింగతి మురళి, గజెల్లి వెంకటయ్య, డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, తిరుపతి, మల్లేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని గోదావరి తీరంలోని గౌతమేశ్వర ఆలయం వద్ద వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పలు రకాల పండ్ల, పూల మొక్కలు నాటినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కేశెట్టి వంశీకృష్ణ, సతీష్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, శివ ప్రసాద్, స్వప్న, రజనీ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బెల్లంపల్లి ఎఫ్‌డీవో విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో బుగ్గ దేవాలయం సమీపంలో స్థానికులకు, భక్తులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలను జమ చేసి డంపింగ్‌యార్డుకు తరలించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో సుభాష్, డిప్యూటి ఆర్‌వో ఆంజనేయులు, తిరుపతి, సతీష్, గౌరిశంకర్, ప్రవీణ్‌నాయక్, ఎఫ్‌ఎస్‌వోలు ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు. కాగా దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సల్లపవాగు సమీపంలో అధికారులు మొక్కలు నాటారు. కంపెనీ ప్రెసిడెంట్ సత్యబ్రత్ శర్మ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి, హెచ్‌ఆర్ జీఎం ఆనంద్‌కులకర్ణి, కార్మికులు పాల్గొన్నారు.

చెన్నూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెన్నూరు జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. చెన్నూరు-కోటపల్లి రహదారిపై ఎఫ్‌ఆర్‌వో రవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రహదారిపై ఉన్న ప్లాస్టిక్ కవర్లను తీసివేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు డివిజన్ పరిధిలోని అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. క్రుందారం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యాధికారిణి శ్రావ్యతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్‌లు గోగు సురేష్‌కుమార్, లక్ష్మణ్, డిప్యూటి ప్లాంటేషన్ మేనేజర్‌లు రాకేష్‌నరేష్, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్,బీట్ ఆఫీసర్ రవీందర్, ఫీల్డ్ సూపర్ వైజర్ శ్రీనివాస్, రాజేష్, తిరుపతి, వాచర్‌లు శంకర్, లచ్చన్న, రాకేష్, వైద్య సిబ్బంది జయమణి, జయమ్మ, గంగయ్య, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా గ్రామీణా అభివృద్ధి శాఖ అధికారి కిషన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురష్కరించుకొని దండేపల్లి మండలం కన్నెపల్లిలో ఉపాధిహామీ కూలీలు పని చేసే ప్రదేశానికి వెళ్లి వారితో కలిసి పలుచోట్ల మొక్కలు నాటించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో దుర్గదాస్, ఈసీ భీమయ్య, టీఏ జగన్, ఉపాధి కూలీలు, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. కాగా తాళ్ళపేట అటవీ రెంజ్ కార్యాలయ ఆవరణలో తాళ్ళపేట అటవీ రెంజ్ అధికారి (ఎఫ్ఆర్వో) సుష్మ మొక్కలు నాటారు. అనంతరం తాళ్లపే ట బస్టాండ్ వారసంతలో ప్రజలకు పర్యావరణపరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కంది హేమలత-సతీష్, డిప్యూటీ రెంజ్ అధికారులు ప్రమోద్ కుమార్, పోచమల్లు, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: సీసీసీలోని రెయిన్‌బో విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ చెన్నూరి ఆమన్ ప్రసాద్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, హరితహారం నిర్వంచారు. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయిలతో కలిసి పాఠశాల నుంచి సిసిసి కార్నర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఉన్న ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు.

భీమారం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాథోడ్ రాధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్‌లు లక్ష్మీనారాయణ, శ్యాంచంద్, పంచాయతీ కార్యదర్శి పోశం, సిబ్బంది పాల్గొన్నారు.



చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు


బుగ్గ దేవాలయంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న అటవీ అధికారులు

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి, జూన్ 5: నీట్ ఫలితాల్లో బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నీట్ పరీక్షకు 26 మంది హాజరు కాగా 11 మంది విద్యార్థులు క్వాలిఫై అయినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు బుధవారం తెలిపారు. జుమ్మిడి ప్రణయ్ 404 మార్కులు సాధించి 34146 ర్యాంకుతో ఆలిండియా కేటగిరి ర్యాంకుతో కళాశాల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. అలాగే గోమాస అఖిల్ 42529వ ర్యాంకు, శివకృష్ణ 56456 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు పలువురు అభినందించారు

అభివృద్ధే ప్రధాన ఎజెండా


మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

చెన్నూరు, జూన్ 5: పెద్దపల్లి నియోజకవర్గాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, తండ్రి గడ్డం వివేక్‌వెంకటస్వామితో కలిసి చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాకా వెంకట స్వామి సేవలను గుర్తిస్తూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి తమ గెలుపుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. పార్లమెంట్ పరిధిలో ఇండస్ట్రీలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెన్న సూర్యనారాయణ, కుర్మ రాజమల్లగౌడ్, చీర్ల సుధాకర్‌రెడ్డి, చల్ల రాంరెడ్డి, హన్మంతరెడ్డి, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎంపీగా గెలుపొంది మొదటిసారిగా చెన్నూరుకు వచ్చిన వంశీకృష్ణకు కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

ప్రజాశ్రేయస్సే కాంగ్రెస్ ధ్యేయం

మందమర్రిటౌన్, జూన్ 5: ప్రజాశ్రేయస్సే కాంగ్రెస్ పార్టీ ధ్యేయ మని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రిలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన తండ్రి కాకా వెంకటస్వామి రెండు దశాబ్దాల పాటు పెద్దపల్లి ఎంపీగా ఎనలేని సేవలందించారన్నారు. తాను కూడా ఒకసారి ఎంపీగా ప్రజల సంక్షేమానికి కృషి చేశానని చెప్పారు. ఈ ఎన్నికల్లో కూడా తన తండ్రి చేసిన సేవలతో పాటు తాను చేసిన సేవలు కలిసి వచ్చి వంశీకృష్ణ విజయం సాధించారన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలందరు కష్టపడి పనిచేసి గెలుపు కోసం కృషి చేశారన్నారు. తమ ప్రభుత్వం కనబర్చిన ప్రజా సంక్షేమం కూడా కలిసి వచ్చిందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కాంగ్రెస్ నాయకులు దుర్గం నరేష్, కాంపెల్లి సమ్మయ్య, గుడ్ల రమేష్, సంగి సంతోష్, మంద తిరుమల్ పాల్గొన్నారు.

- బాధిత కుటుంబానికి పరామర్శ

దీపక్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు పైడిమల్ల నర్సింగ్ తల్లి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి బుధవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు దుర్గం నరేష్, గుడ్ల రమేష్, బండి సదానందం, సంగి సంతోష్ , జావేద్‌ఖాన్, తిరుమల్ ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

ఆసిఫాబాద్, జూన్ 5: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించడంలో ప్రతిఒక్కరూ పాత్రదారులు కావాలని డిప్యూటీరేంజ్ అధికారి యోగేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రేంజ్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా రెబ్బెన ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రీధర్ చారితో కలిసి బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైంత వరకు మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారిసరోజరాణి, రాజేశ్వరచారి, సెక్షన్ అధికారులు సాయి, సతీష్, భగవంతరావు, సత్యనారాయణపాల్గొన్నారు.

తిర్యాణి: మండలంలో అటవీశాఖ కార్యాలయం నుంచి కుమరంభీంచౌరస్తా వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమ్మక్క గద్దెల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను శ్రమదానం చేసి తొలగించారు. నర్సరీని సందర్శించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో తిర్యాణి ఎఫ్ఆర్వో శ్రీనివాస్, గిన్నెధరి, ఎఫ్ఎస్‌వోప్రవీణ్‌కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని ముక్దాంగూడ, పరందోళి గ్రామాల్లో అమృత్‌సరోవర్ నీటికుంటలను ఎంపీడీవో అంజద్‌పాషా, ఏపీవో మల్లయ్య, ఎఫ్ఏలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్థులతో కలిసి సందర్శించారు. అనంతరం మొక్కలు నాటారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎఫ్ఆర్వో అప్పలకొండ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషిచేయాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. అటవీశాఖ కార్యాలయంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు రమాదేవి, పూర్ణచందర్, దయాకర్, సుధాకర్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని అచ్చెల్లి అమృత్ సరోవర్ వద్ద బుధవారం ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి, ఈసీ నగేష్, కార్యదర్శి మౌనిక మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని బుధవారం ఎంపీడీవో రాజేందర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఉపాధిహామి కూలీలతో కలిసి పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఉపాధి హామి కూలీలతో కలిసి ఎంపీడీవో మొక్కలు నాటారు.




కాగజ్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న ఎఫ్‌డీవో అప్పలకొండ

పెంచికలపేట: మండలంలోని ఆగర్‌గూడలో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ప్రతిఒక్కరు మొక్కలనునాటడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు వరుణ్‌రెడ్డి, వెంకటేశం, గ్రామస్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

జన్నారం, జూన్ 5: మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధి లోని శ్రీలంకకు చెందిన ఎల్.దేవాజీ (55) అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు బుధవారం తెల్లవారుజామున కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గత కొన్ని రోజులుగా దేవాజీ ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతుండగా కొన్ని రోజుల క్రితం ఆసుపత్రిలో చేర్పిం చారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుం బీకులు తెలిపారు. దేవాజీ ఇందన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యా యుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ మేరకు పలువురు ఉపాధ్యాయులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.







సీఎంఆర్ త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 5: రైస్‌మిల్లర్లు సీఎంఆర్ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సీఎంఆర్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 286 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. నిర్ధేశిత లక్ష్యం పూర్తి చేయబడిన 281 కొనుగోలు కేంద్రాలను మూసివేశామని తెలిపారు. 5 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగు తుందన్నారు. లక్ష్య సాధనలో నిర్లక్ష్యం, అలసత్వం వహించిన రైసుమిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. పెద్దపల్లికి తరలించిన ధాన్యం సంబంధిత నగదును ఆయా రైతుల ఖాతాల్లో త్వరలోనే చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతి లాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

● ఏకాగ్రతతో నేర్చుకోవాలి

గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో భాగంగా అందిస్తున్న శిక్షణలో ప్రతీ అంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముఖ్య పర్యవేక్షకులు, పరిశీకుల శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, ప్రాంతీయ సమన్వయకర్త చక్రపాణితో కలిసి హాజరై మాట్లాడారు. జూన్ 9న ఉదయం స్ట్రాంగ్ నుంచి పరీక్ష కేంద్రాలకు కేటాయించిన రూట్ల ప్రకా రం రూట్ అధికారులతో ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్, ఇతర సామగ్రి పోలీసు బందోబస్తు మధ్య తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పరీక్షకేం ద్రాల కు చేరుకున్న సామగ్రి, పత్రాలను ముఖ్య పర్యవేక్షకులు, పరిశీకుల సమక్షంలో వీడియో చిత్రీకరణతో తెరవాలని తెలిపారు.









ప్రభుత్వ డిగ్రీకళాశాలకు గ్రీన్ చాంపియన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా

లక్సెట్టిపేటరూరల్, జూన్ 5: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (తెలంగాణ పొల్యూ షన్ కంట్రోల్ బోర్డు) నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సం 2024 గ్రీన్ చాంపియన్‌షిప్ అవార్డును లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల సిబ్బంది బుధవారం అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలోని కళాశాలలో విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట గ్రీన్ చాంపియన్ అవార్డు 2024 ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ఈ అవార్డును బుధవారం జూన్ 5న ప్రపంచ పర్యావ రణ దినోత్సవం 2024 సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, పర్యావరణ అటవీ శాస్త్ర సాంకేతిక రంగాల ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణి ప్రసాద్, మెంబర్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్ గార్ల చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా హైదరాబాద్‌లో అందుకున్నారు. కళాశాలలో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం లో బాగంగా నిరంతరం కొనసాగుతున్న మొక్కల పెంపకం, నీటి వనరుల పొదుపు, విద్యుత్ పొదుపు, ప్లాస్టిక్ రహిత కళాశాల ప్రాంగణం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి కళాశాలలో ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా వెంట అధ్యాపకులు డాక్టర్ హరీష్, మహేష్ తదితరులు ఉన్నారు.

● సింగరేణి వైద్యశాలకు..

మందమర్రిటౌన్, జూన్ 5: మందమర్రిలోని రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి టీజీపీసీబీ గ్రీన్ చాంపియన్ 2023 అవార్డును ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా ఈ అవార్డును తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికా రి వాణిప్రసాద్ చేతుల మీదుగా ఏసీఎంవో ఉష అందుకున్నారు.

అభివృద్ధికి పాటుపడుతాం

బెల్లంపల్లి, జూన్ 5: బెల్లంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి పాటు ఎడు తామని ఎమ్మెల్యే వివేక్ అన్నారు. బుధవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకు లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వంశీని ఎంపీగా గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని అన్నారు. అదే విధంగా బెల్లంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి , ప్రజల సంక్షేమానికి వంశీ కృషి చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ గెలుపు నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరిది అని తెలిపారు. కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు చిలుముల శంకర్, మునిమంద రమేష్, ముచ్చర్ల మల్లయ్య, సూరిబాబు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 5: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలో బయోమెట్రిక్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రామగుండం ఏసీపీ సురేంద్ర, ప్రాంతీయ సమన్వయకర్త చక్రపాణితో కలిసి బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు శిక్షణ నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ పరీక్ష కోసం 27 కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 9,384 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఈ క్రమంలో బయోమెట్రిక్ హాజరు నమోదు చాలా కీలకమని, విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు కేటాయించిన 71 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు హ్యాండ్స్ ఆన్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం పోలీసు బయోమెట్రిక్ అధికారి ప్రమోద్, సహాయ అధికారి ముజాహిద్, సమన్వ యకర్త జాడి మహేష్ ఇన్విజి లేటర్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు సకాలంలో అందజేయాలి

దండేపల్లి, జూన్ 5: విద్యార్థుల స్కూల్ యూనిఫామ్‌లు కుట్టడంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు సకాలంలో అందజేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్ సూచించారు. బుధవారం దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్, నాగసముద్రంలో విద్యార్థుల స్కూల్ యూనిఫాం కుట్టు కేంద్రాలను ఆయన సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఐకేపి ఏపీఎం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

దండేపల్లి, జూన్ 5: మెడిసిన్‌లో ప్రవేశం పొందటానికి నిర్వహించిన నీట్ పరీక్షలో మంగళవారం ప్రకటించిన ఫలితాలల్లో దండేపల్లి మండలానికి చెందిన ఇద్దరు బాలికలు ప్రతిభ చాటడంతో బుధవారం పలువురు అభినందించారు. దండేపల్లి మండలం గూడెం చెందిన కానగంటి సుహితవర్మకు 511మార్కులు సాధించగా, దండేపల్లి గ్రామానికి చెందిన పురేళ్ల శ్రీజకు 503 మార్కులు సాధించారు.

నకిలీ విత్తనాలకు చెక్

- ముమ్మరంగా కొనసాగుతున్న తనిఖీలు


జైపూర్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)


జైపూర్, జూన్ 5: వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయించకుండా అధికారులు చెక్ పెడుతున్నారు. ఎన్నో ఆశలతో అన్నదాతలు వానాకా లం సాగుకు సిద్ధమవుతున్నారు. రైతులు ముం దస్తుగా విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో బిజీ అయ్యారు. దీనిని ఆసరాగా చేసుకుని దళారులు ఆశ చూపి రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. ఈ క్రమంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై నకిలీ విత్తనాల కట్టడికి చెక్ పెడుతున్నారు. జి ల్లా, మండలాల్లో ఇప్పటికే వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వ యంతో తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. విత్తనాల దుకాణాలతో పాటు సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేకంగా నిఘా ఉంచారు. మండలంలో ఎక్కువగా రైతులు పత్తి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో దళారులు ధనార్జనే ధ్యేయంగా జిల్లాలో కొన్ని చోట్ల నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. కలుపు నివారణ కోసం మందు పిచికారీ చేస్తే సరిపోతుం దని నమ్మించి అమాయక రైతులకు అంటగట్టి నిండా ముంచుతున్నారు. దీంతో నకిలీ విత్తనాలను అరికడితే రైతులకు చేర కుండా ఉంటాయని భావించిన అధికారులు దుకాణాలపై నిఘా ఉంచు తున్నారు. తరుచూ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమతి లేని విత్తనాలతో పాటు సరిహద్దు ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

నాలుగు రోజులుగా అంధకారంలో 11గ్రామాలు


రాస్తారోకో చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 5: ఆసిఫాబాద్ మండలం పాడిబండ గ్రామపంచాయతీ పరిధిలోని 11గ్రామాలు నాలుగు రోజులుగా అంధకారంలో మగ్గుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గ్రామమహిళలు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగిపడడం, ఉరుములు మెరుపులతో కరెంటు ట్రాన్స్ ఫార్మర్‌లు కాలిపోయాయి. దీంతో నాలుగు రోజులుగా పాడిబండ గ్రామపంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామాల ప్రజలు కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆదివాసీ సేన మండలాధ్యక్షుడు కైలాస్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌అధికారులకు ఈ విషయం తెలసినా నాలుగు రోజులుగా స్పందించడం లేదని ఆయన అన్నారు. ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చిర్రకుంట నుంచి దాంపూర్ వరకు రోడ్డు గుండా 11కేవీ లైన్ మంజూరు చేసినప్పటికీ పనులు మొదలు పెట్టలేదన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు లక్ష్మి, భాగ్యలక్ష్మి, రమ్య, రేణుక, జంగుబాయి, యమున, లక్ష్మి, మానిక్ రావు, కాంతారావు, రాజు, సక్కు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా 'రియల్' వెంచర్లు



- జిల్లాలో ఇష్టానుసారంగా దందా
- కొన్నింటికి మాత్రమే డీటీసీపీ అప్రూవల్
- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 5: జిల్లాలో స్థిరాస్తి వ్యాపారంపై కొంతమంది రియల్టర్లు నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ల దందాను విచ్చలవిడిగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్ చేయాల్సి ఉండగా, నిబంధనలన్నీ పాతర పెట్టేసి ఇష్టానుసారంగా ప్లాట్లు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. డీటీసీపీ నిబంధల ప్రకారం జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూరు నియో జకవర్గాల్లో వివిధ గ్రామాల్లో 80 శాతం మేర నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు చేసి కోట్లలో లాభాలు గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా పట్టించుకోవాల్సిన జిల్లా అధికారులు వీటివైపు కన్నెత్తి కూడా చూడటం లేదంటే పరిస్థితి ఇట్టే ఊహించుకోవచ్చు. వెంచర్ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దిశానిర్ధేశం చేసింది. ఇందులో ఒక ఎకరం భూమిలో ప్లాట్లు చేయాలంటే తొలుత నాలా కన్వెర్షన్ చేయాల్సి ఉంటుంది. అలాగే వెంచర్‌లో క్రీడాస్థలం, తాగునీటి ట్యాంకు, అంతర్గతరోడ్లు ఇతర అంశాలను స్పష్టంగా చూపించాల్సి ఉంటుంది. అనంతరం వీటిని డీటీ సీపీ అప్రూవల్ చేసిన తర్వాతనే ప్లాట్లుగా విభజించి అమ్మాల్సి ఉంటుంది. ఈ నిబంధనలన్నింటిని పక్కన పెట్టి ఏ ఒక్కటి కూడా పాటించకుండా అంతా ఇష్టానుసారంగా ప్లాట్లు చేసి వెంచర్ నిర్వాహకులు లాభాలు గడిస్తున్నారు.

ఏజెన్సీ ఏరియాల్లోనూ..

జిల్లాలోని ఏజెన్సీ ఏరియాల్లో రియల్టర్లు అక్రమవెంచర్లు యథేచ్ఛగా చేస్తున్నారు. తెలిసోతెలియక వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసుకున్న వారికి కొత్త నిబంధనలతో అంతా హైరానపడుతున్నారు. వాస్తవంగా ఏజెన్సీ ఏరియాలో భూముల క్రయ, విక్రయాలు చేయ రాదు. కానీ జిల్లాలో ఈ ప్రక్రియ యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో వివిధ పార్టీల నాయకులు జిల్లాస్థాయి అధికారులకు, ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా ఇంతవరకు ఈ దందా ఆగటం లేదు. కాగజ్ నగర్ మండలం భట్టుపల్లి, చింతలమా నేపల్లి, కౌటాల మండలాల్లోను ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఏజెన్సీ ఏరియాల్లో గిరిజనులకు హక్కులున్నప్పటికీ గిరిజనేతరులు ఇష్టానుసారంగా ఆక్రమణలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా జిల్లాస్థాయి అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. 1/70చట్టం అమల్లో ఉన్నప్పటికీ కూడా ఇంత వరకు ఆచరణలోకి రావటం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ వెంచర్లపై నిఘా పెట్టాం..
కిరణ్‌కుమార్, తహసీల్దార్, కాగజ్‌నగర్

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ వెంచర్లపై నిఘా పెట్టాం. ఏజెన్సీ ఏరియాలోఎలాంటి అనుమతులివ్వటం లేదు. గతంలో ప్లాట్లు చేస్తే తొలగించాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు. చర్యలు తీసుకుంటాం.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి: డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాంభట్

వాంకిడి, జూన్ 5: పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి తుకారంభట్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షించేలా కృషిచేయాలన్నారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల న్నారు. వర్షాకాలంలో కలుసితమైన నీరు చేరడం వల్ల అంటువ్యాధులు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకావం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, వైద్యాధికారి వినయ్ కుమార్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మొరాయించిన వేంపల్లి రైల్వే గేటు


గేటు వద్ద నిలిచిపోయిన వాహనాలు

సిర్పూర్(టి), జూన్ 5: మండలంలోని వేంపల్లి సమీపంలోని సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారి పైఉన్న రైల్వేగేటు బుధవారం కొద్దిసేపు మొరాయించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇరు వైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. స్పందించిన రైల్వే ఇబ్బంది మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్దరించారు. కాగా తరుచూ సమస్య ఏర్పడుతోందని అధికారులు స్పందించి గేటుసమీపంలో ఆర్‌వోబీ పనులు పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఫెర్టిలైజర్ షాపుల్లో వ్యవసాయాధికారుల తనిఖీలు


కాగజ్‌నగర్, బెజ్జూరులలో ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు

కాగజ్‌నగర్, జూన్5: పట్టణంలో ఫెర్టిలైజర్ దుకాణాలను బుధవారం అధికారులు తనిఖీ చేశారు. నకిలీ పత్తివిత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. తనిఖీ చేసిన వారిలో ఏడీఏ మనోహర్, ఏవో రామకృష్ణ, పట్టణసీఐశంకరయ్య తదితరులున్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని కర్జవెల్లి గ్రామంలో పలుఫర్టిలైజర్ దుకాణాలను ఏఈవో విజయ్ బుధవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా రైతులకు అందజేస్తున్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. అలాగే స్టాక్‌రిజిస్టర్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రశీదులు తీసుకోవాలని రైతులకు సూచించారు. నిబంధనలకు అనుగుణంగా షాపులు నిర్వహించాలని యజమానులకుసూచించారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

బెజ్జూరు: మండలంలోని రెబ్బెన, లుంబినీ నగర్ ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం ఏఈవో రవితేజ తనిఖీ చేశారు. షాపు యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ ధరలకు మాత్రమే విత్తనాలు, ఎరువులు విక్రయించాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు కూడా ఆమోదం పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రశీదులు తీసుకోవాలన్నారు.

వర్షాకాలం.. వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కుడ్మెత మనోహర్

జైనూర్, జూన్ 5: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధులు ప్రబల కుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. స్థానిక 30పడకల సముదాయాన్ని ఆయన బుధవారం సందర్శించి ఆసుపత్రిలోని పలురికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవించేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు. వైద్యసిబ్బంది స్థానికంగా ఉంటూ వైద్యసేవలు అందిచేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. హైరిస్క్ గ్రామాలపై ప్రధానంగా దృష్టిసారించాలన్నారు. సబ్‌సెంటర్ల వారీగా విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జితేందర్ రెడ్డి, నాగర్ గోజే అశోక్, మలేరియా సబ్ యునిట్ అధికారి జాదవ్‌గణేష్, హెచ్‌ఈవో జాదవ్ రమేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

ఆసిఫాబాద్, జూన్ 5: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. పదవ తరగతిలో సాధించిన మెరిట్, రోస్టర్ ఆధారంగా గ్రూపునకు 40మంది చొప్పున 160మందిని ఎంపిక చేశాన్నారు. ఎంపిక జాబితా కళాశాల నోటీసు బోర్డుపై అందు బాటులో ఉందని విద్యార్థుల ఈనెల 6నుంచి 8వరకు ధ్రువపత్రా లతో రావాలన్నారు.

తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు దాతల అండ


పిల్లలకు సాయం చేస్తున్న దాతలు

కౌటాల, జూన్ 5: మండలంలోని పార్డి గ్రామానికి చెందిన మడావి దివాకర్, శారద దంపతులు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో పలువురు దాతలు స్పందించి తమ వంతు సాయం అందించారు. అనాథైలన పిల్లలు నానమ్మ, తాత విమలాబాయి, కాశీనాథ్‌ల వద్ద ఉంటున్నారు. దాతలు అందించిన నగదు, పోలీసువారు తమవంతు సహకారం అందించి బుధవారం కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్సై మధుకర్ పత్రికా విలేకరులతో కలిసి రూ.40,500నగదు, 75కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. దీనికి ముందు దాతలు 4క్వింటాళ్ల బియ్యం, రూ.4వేల నగదు, నిత్యావసర సరుకులు, రెండు నెలలకు సరిపడా పాలపొడి డబ్బాలు అందించారు. మానవత్వంచాటి తమవంతు సహకారం అందించిన పెద్దలందరికీ పిల్లలు, వారి నానమ్మతాత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహేష్, శ్రీనివాస్, సురేష్, నాగార్జున్, రాజు, విలాస్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు


స్వీట్లు తినిపిస్తున్న జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 5: ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో బుధవారం బీజేపీ సీనియర్ నాయకుడు జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి పనులతోనే ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకున్నామన్నారు. అనంతరం అరిగెల నాగేశ్వర్‌రావును బీజేపీ నాయకులు, కార్యకర్తలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు కేశవ్, వైస్ఎంపీపీ మంగ, పెంటయ్య, ప్రసాద్‌గౌడ్, సత్యనారాయణ, సంతోష్, ప్రహ్లాద్, రవి, బాపు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: మండలంలో బుధవారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి గోడం నగేష్ విజయం సాధించడంతో బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్‌గౌడ్, నాయకులు వెంకటేష్, భాస్కర్, సుభాష్, గోపాల్, తులసీరాం, తిరుపతి, అరుణ్‌కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించి.. పెళ్లికి నిరాకరణ

- పలువురిపై కేసు నమోదు

జైనూర్, జూన్ 5: ఒక అమ్మాయిని ప్రేమించి మోసం చేసిన మండలకేంద్రానికి చెందిన ఆజర్ ఖురేషి, అతనికి సహకరించిన సోహేల్ ఖురేషి, ఇమ్రాన్, రఫీక్, సత్తార్‌పై కేసు నమోదు చేసినట్లు జైనూర్ సీఐ అంజయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్‌కు చెందిన ఓ అమ్మాయిని జైనూర్‌కు చెందిన ఆజర్ ఖురేషి 3సంవత్సరాలు మాయమాటలతో మభ్యపెట్టి ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమెతో గతంలో తీసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరిస్తూ జైనూరుకు రమ్మని బెదిరిస్తున్నాడు. బాధితురాలు పెళ్లి చేసుకోవాలని కోరడంతో ఆజర్ ఖురేషి వాటిని నిరాకరించాడు. దీంతో ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేశామన్నారు.

ఆసిఫాబాద్ మండలంలో కాంగ్రెస్‌కు ఆధిక్యం

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 5: ఆసిఫాబాద్ మండలంలో కాంగ్రెస్ హవా కొనసాగింది. మంగళవారం జరిగిన లోక్‌సభ ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు 14,620ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌కు 9,735, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు 5,687ఓట్లు వచ్చాయి. దీంతో బీజేపీ అభ్యర్థిపై కాంగ్రెస్ అభ్యర్థి 4,885ఓట్ల ఆధిక్యతను చాటుకుంది. మండలంలో మొత్తం ఓటర్లు 43,632మందికి గాను 32,632మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిసెంబరులో జరిగిన అసెంబ్లీఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీర శ్యాంనాయక్‌కు మండలంలో 14,348ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి 14,381ఓట్లు వచ్చాయి. గతఅసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో బీఆర్‌ఎస్‌కు స్వల్ప ఆధిక్యత రాగా ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ దక్కింది.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

లింగాపూర్, జూన్ 5: తాగడం మానేయాలని కొడుకు మందలిం చడంతో మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మ హత్య చేసుకుంది. లింగాపూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిక్లాతండా గ్రామానికి చెందిన బోడ దేవులిబాయి(59) కొద్దినెలలుగా తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో, ఇరుగుపొరుగు వాళ్లతో రోజూ గొడవలు పడుతోంది. మహిళలు మద్యం తాగడం బాగుండదని కొడుకు శంకర్ మంద లించాడు. దీంతో సోదరుడి ఇంటికి పోయి వస్తానని చెప్పి వ్యవసాయ బావిలోదూకి ఆత్మహత్య చేసుకుంది. శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

మూగ బాలిక ఆశ్రమానికి తరలింపు

చింతలమానేపల్లి, జూన్ 5: మండలంలోని బాబా సాగర్ గ్రామంలో అయిదు సంవత్సరాలక్రితం తల్లిదండ్రులను కోల్పోగా మూగ బాలిక గొర్లపల్లి శైలజ అనాథగా ఉంటోంది. బాలిక పరిస్థితి చూసి చలించిన సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాష్, సిద్దం పెంటయ్య బుధవారం మంచిర్యాల పట్టణంలోని కల్వారి యువశక్తి అనాథ ఆశ్రమ అధ్యక్షుడు ముల్కల కుమార్‌కు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన ముల్కల కుమార్ గ్రామానికి వచ్చి చింతలమానేపల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్సై నరేష్, గ్రామస్థుల సమక్షంలో బాలికను ఆశ్రమానికి తీసుకెళ్లారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

పెంచికలపేట, జూన్ 5: మండల పరిధిలో ఆర్టీవో అధికారులు బుధవారం ధ్రువపత్రాలు లేకుండా తిరుగుతున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు సరైనపత్రాలు కలిగి ఉండాలని, రోడ్‌టాక్స్, ఫిట్నెస్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న ఆదివాసీ సమాజం సభ్యులు

బెజ్జూరు, జూన్ 5: మండలంలోని కోర్తెగూడ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన అర్కగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహేష్ కుటుంబానికి రూ.25వేలు, బారెగూడ గ్రామానికి చెందిన తొరెం వెంగలరావ్ కుటుంబానికి రూ.15వేల విలువచేసే సరుకులను బుధవారం ఆదివాసీ సమాజంసభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీపెద్ద లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్వయంసహాయక సంఘాలసభ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పూడిక తీత పనులు


కాలువలో పూడిక తొలగింజేస్తున్న మున్సిపల్ అధికారులు

ఆసిఫాబాద్, జూన్ 5: వర్షాకాలం ముందస్తు చర్యల్లో భాగంగా ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని డ్రెయినేజీల్లో బుధవారం పూడికతీత పనులు చేపట్టారు. కమిషనర్ భుజంగరావు మాట్లాడుతూ వర్షాకాలంలో వరదనీరు నిలువ ఉండకుండా డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడిక, పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది నాగేందర్, సంతోష్, వంశీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో కురిసిన వర్షం

కెరమెరి, జూన్ 5: మండలంలోని గోయగాం, సావర్‌ఖేడ, ధనోర, పార్డి, కోటారి,రాంనగర్ గ్రామల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కాగా ఇప్పటికే రైతులు వానాకాలం పనులు ప్రారంభించగా కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి


శ్రీరాంపూర్ ఓసీపీలో ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం సంజీవరెడ్డి, ఇతర అధికారులు, ఉద్యోగులు



మందమర్రిలో ఉద్యోగులకు క్లాత్ బ్యాగులను పంపిణీ చేస్తున్న జీఎం మనోహర్

శ్రీరాంపూర్, జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జీఎం బి సంజీవరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం జీఎం కార్యాలయంతోపాటు వివిధ గనులపై ఘనంగా నిర్వహించారు. ఆర్కే8 డిస్పెన్సరీలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎం బి సంజీవరెడ్డి పాల్గొని చైర్మన్ సందేశాన్ని ఆవిష్కరించారు. మానవ జాతి మనుగడ పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉందన్నారు. 'నేల పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునేశకి' అనే స్లోగన్‌ను ఆయన ఇచ్చారు. ఆర్కే5 గని ఆవరణలో జీఎం బి సంజీవ రెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి మొక్కలు నాటారు. అనంతరం ఉద్యోగులతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ ఎండి అబ్దుల్ ఖదీర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఎస్‌వోటు జీఎం వి. పురుషోత్తమ రెడ్డి, డిజిఎంలు, తదితరులు పాల్గొన్నారు. ఎస్ఆర్పీ3 గనిపై మేనేజర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో రక్షణాధికారి శ్రీధర్, పర్యావరణ అధికారి అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో పీవో టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు సందర్భంగా ఒక మొక్క నాటాలని సూచించారు. క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకుడు రాచర్ల చంద్రమోహన్, అధికారుల సంఘం ప్రతినిధి కరీముద్దీన్ పాల్గొన్నారు. ఆర్కే6 గనిపై నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో ప్లాస్టిక్ రహిత గనిగా చేస్తామని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గని మేనేజర్ ఈ తిరుపతి, రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, సంక్షేమాధికారి కె సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి..: జీఎం మనోహర్

మందమర్రి టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జీఎం కార్యాలయంలో అధికారులకు, ఉద్యోగులకు బట్ట సంచులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను నిషేధిం చాలన్నారు. చెట్లతోనే మానవ మనుగడ ముడి పడి ఉందని, ఇంటి పరిసరాల్లో, ఖాళీస్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, పర్యావరణ అధికారి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్ కోసం మొక్కలు నాటాలి..

భావి తరాల భవిష్యత్ కోసం ప్రతిఒక్కరూ పదికి పైగా మొక్కలు నాటి సంరక్షించాలని కేకే5 గని మేనేజర్ అల్లావుద్దీన్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గని సమీపంలో ఉన్న బలరాం వనంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సింగరేణి సీఎండీ బలరాం పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణకు గనిపరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పశుపక్ష్యాదుల ఆకలి తీర్చేందుకు గని ఆవరణలోని 8ఎకరాల్లో మంకీ ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేశామన్నారు. కాలుష్య నివారణ కేవలం చెట్ల పెంపకంతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం నాగరాజు, రక్షణాధికారి రమేష్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్, సంక్షేమాధికారి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



గనులను ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలి

కాసిపేట, జూన్ 5: సింగరేణిలో ప్రమాదరహిత గనులుగా తీర్చిదిద్దడంలో కార్మికులందరు భాగస్వాములు కావాలని మందమర్రి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ అన్నారు. బుధవారం కాసిపేట 2వ గనిలో కార్మికులకు రక్షణ సూత్రాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు పనిస్థలాల్లో అప్రమత్తంగా ఉంటూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. సింగ రేణిలో జూన్‌లో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు జూన్ నెలను ప్రమాదరహిత మాసంగా గుర్తించి ప్రమాదాలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో కాసిపేట గ్రూపు ఏజెంటు రామదాసు, గనిమేనేజర్ లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ పిట్‌కార్యదర్శి గొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.